క్లుప్తంగా

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం



పెనుగంచిప్రోలు: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం అని తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి అన్నారు. గ్రామంలోని శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద మంగళవారం 174 నుంచి 176, గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద 177 నుంచి 179 పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటర్లకు ఈవీఎం, ఈవీ ప్యాట్స్‌పై అవగాహన కలిపిస్తున్నామన్నారు. నూతన ఓటర్లు ఈవీఎం ప్యాట్స్‌పై ఓటు వేసేందుకు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ జనార్దనరావు, వీఆర్వోలు లక్ష్మి, బేబి తదితరులు పాల్గొన్నారు.

26నుంచి మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

నందిగామ: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ పరిధిలో ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులు ఈ నెల 26 నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు కటారపు గోపాల్, మున్సిపాలిటీ పరిధిలో ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి వారి ఆలయంలో హుండీ చోరీ

నందిగామ: ఆంజనేయ స్వామి వారి ఆలయంలో హుండీ చోరీకి గురైన ఘటన నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పట్టణ సీఐ హనీష్ తెలిపిన సమాచారం ప్రకారం పట్టణ శివారు అనాసాగరం గ్రామంలో 65 వ నంబర్ జాతీయ రహదారి పక్కనే అభయాంజనేయ స్వామి వారి ఆలయం ఉంది. ఆలయ ప్రాంగణంలో ఉన్న హుండీని సోమవారం రాత్రి సమయంలో దుండగులు అపహరించారు. మంగళవారం నాడు ఆలయానికి వచ్చిన అర్చకుడు గమనించి గ్రామస్తులకు తెలిపాడు. వెంటనే ఆలయ నిర్వాహకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు మృతి

నందిగామ: పట్టణంలోని డాన్ బాస్కో బాలుర ఉన్నత పాఠశాలలో దీర్ఘకాలం పాటు వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేసిన ఎ.జోజిబాబు (80) మంగళవారం మృతి చెందారు. దాదాపు 30 సంవత్సరాలకు పైగా ఆయన ఆ పాఠశాలలో సేవలందించారు. జోజిబాబు మృతికి విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకుడు పిల్లి జయరాజు సంతాపం వ్యక్తం చేశారు.

80 మందికి ఉచిత కంటి పరీక్షలు



వత్సవాయి(పెనుగంచిప్రోలు): వత్సవాయి మండలం కంభంపాడు గ్రామంలోని రోజ్ స్కూల్‌లో మంగళవారం చిన్న అవుటపల్లి, పిన్నమనేని సిద్ధార్థ కంటి ఆసుపత్రి, కొమరగిరి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో మొత్తం 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా ఐదుగురిని శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు ట్రస్ట్ చైర్మన్ కొమరగిరి భరద్వాజ్ తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ పి.పద్మ, బాలాజీ, వైద్యులు అనీషా, నాజియా, సాయికుమార్, పీఆర్వో రాఘవ పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల జగనన్నతోనే సాధ్యం

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): పేదల సొంత ఇంటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారని జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిలర్, యువజన నాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ అన్నారు. గ్రామంలోని జగనన్న కాలనీలో మంగళవారం నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో నూతనంగా అభివృద్ధి చేసిన ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి, సొసైటీ భవనాన్ని సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలోనే 30 లక్షల మందికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇచ్చిన ఘనత ఒక్క జగనన్నకే దక్కుతుందన్నారు. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు మరింత వేగం పుంజుకోవాలన్నారు. కాలనీల్లో అన్ని రకాల సౌకర్యాలు ప్రభుత్వం కలిపిస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కనకపూడి భాస్కర రావు, సొసైటీ అధ్యక్షుడు పిడికిటి కోటేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు గంగూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణ చెరలో కీసర-గండేపల్లి రోడ్డు

- రోడ్లను ఆక్రమించి అక్రమంగా ఇళ్లు, దుకాణాల నిర్మాణం
- అక్రమంగా కట్టడాలు నిర్మించి అద్దెకు ఇస్తున్న కబ్జాదారులు
- కుంచించుకుపోయిన ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, జెడ్పీ రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రయాణికులు



గండేపల్లి నుంచి కీసర వెళ్లే రోడ్డు ఆక్రమణలకు గురవటంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

కంచికచర్ల: ప్రయాణికులు, వాహనదారులతో నిత్యం రద్దీగా ఉండే రోడ్డు ఆక్రమణకు గురైంది. దీంతో వాహనచోదకులు నిత్యం అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని 65వ నంబర్ జాతీయ రహదారి కీసర నుంచి గండేపల్లి వెళ్లే జిల్లా పరిషత్ రోడ్డులో కొంతమంది వ్యక్తులు ఇరు వైపులా అక్రమంగా దుకాణాలు, ఇళ్ల నిర్మాణం చేపట్టారు. దీంతో రోడ్డంతా కుంచించుకుపోయింది. ఈ రోడ్డుపై ఎదురెదురుగా వాహనాలు వస్తే ఆ ట్రాఫిక్ నుంచి బయట పడాలంటే కనీసం పావుగంట పడుతుంది. ఈ రోడ్డు పక్కన అక్రమంగా నిర్మించిన దుకాణాలు ఉండటంతో షాపులకు వచ్చే కొనుగోలుదారులు వారి వాహనాలను రోడ్డుపై ఆపుతున్నారు. దీంతో ట్రాఫిక్ మరింత జటిలమవుతోంది. ఈ రోడ్డు మండలంలోని గండేపల్లి గ్రామాన్ని కలుపుకొంటూ వీరులపాడు మండలం జమ్మవరం, బోడవాడ, నందలూరు, తాటిగుమ్మి, జుజ్జూరు తదితర గ్రామాలకు వెళుతుంది. ఇదే రోడ్డుపై తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం వరకు ప్రయాణికులు, వాహనదారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. గండేపల్లిలో సెంటినీ కర్మాగారం ఉంది. ఈ కర్మాగారాన్ని కార్మికులు నిత్యం వందల సంఖ్యలో బస్సుల్లో, ఆటోల్లో వెళుతుంటారు. కీసర, గండేపల్లి గ్రామాల్లో రోడ్డు మార్జిన్ స్థలాలను దర్జాగా ఆక్రమించుకుని షాపుల నిర్మాణం చేపట్టారు. కొంతమంది అక్రమంగా షాపులు కట్టి అద్దెకు ఇచ్చి నెలవారీగా భారీగా వసూలు చేసుకుంటున్నారు. మరి కొందరు సొంతంగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. రోడ్డంతా ఆక్రమణకు గురవటంతో పది అడుగులు మాత్రమే ఉంది. దుకాణాల ఎదుట వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో రోడ్డు మరింత ఇరుకుగా మారి వాహనదారులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. గండేపల్లి సెంటినీ కర్మాగారానికి చిన్నస్థాయి వాహనాల నుంచి భారీ కంటైనర్లు సైతం నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి.

ఆక్రమణలు తొలగించాల్సిందే



గ్రామీణ ప్రాంతమయిన గండేపల్లి కీసర రోడ్డులో కొంతమంది వ్యక్తులు అక్రమంగా రోడ్డును ఆక్రమించుకుని ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా కట్టడాలు కట్టి అద్దెకు ఇస్తున్నారు. ఈ విషయంపై గ్రామస్తులు అనేకసార్లు వినతిపత్రాలు అందజేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పక్కన ఆక్రమణలు తొలగించి ప్రజలు, వాహనదారులు, ప్రయాణికుల ఇక్కట్లు తొలగించాలి.

– తలమాల కిషోర్‌బాబు, వాహనదారుడు, గండేపల్లి

రోడ్డు నిర్మాణానికి రూ.2.కోట్ల నిధులు మంజూరు



కంచికచర్ల మండలం కీసర నేషనల్ హైవే నుంచి చెవిటికల్లు వత్సవాయి రోడ్డు గోకరాజుపల్లి గ్రామం వరకు రోడ్డు నిర్మాణ పనులకు రూ.2కోట్ల నిధులు మంజూరయ్యాయి. త్వరలో రోడ్డు నిర్మాణ పనులు చేపడతాం.

– పాలపర్తి సురేష్ ఆర్‌అండ్‌బీ ఏఈ, నందిగామ

ప్రతి ఒక్కరికీ హెల్త్ కార్డులు అందజేస్తాం

డీఎంహెచ్‌ఓ సుహాసిని



ముక్త్యాలలో నూతన ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులను పంపిణీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి సుహాసిని

ముక్త్యాల(జగ్గయ్యపేట): జిల్లాలో ప్రతి ఒక్కరికీ హెల్త్ కార్డులు అందజేస్తామని ఎన్టీఆర్ జిల్లా వైద్యాధికారి ఎం.సుహాసిని తెలిపారు. బూచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ముక్తేశ్వర పురం (ముక్త్యాల) సచివాలయంలో నూతన ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులను మంగళవారం రాత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో విడతల వారీగా కార్డులు పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటివరకు 4 వేల కార్డులను అందజేశామన్నారు. వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్యశ్రీపై మరింత అవగాహన కల్పిస్తూ కొత్త ఫీచర్లతో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులపై అవగాహన కూడా కల్పిస్తున్నారన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి మొబైల్ ఫోన్లో ఆరోగ్యశ్రీ యాప్ ను డౌన్లోడ్ చేసే ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో డీపీఎంఓ నవీన్, వైద్యాధికారి అనిల్ కుమార్, బూచవరం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు బాలాజీ నాయక్, విద్యాసాగర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా ఓటర్ల జాబితా సిద్ధం చేస్తున్నాం

ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మహేశ్వరరావు



సమీక్ష సమావేశంలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు

జగ్గయ్యపేటఅర్బన్: ఎటువంటి తప్పులు లేకుండా ఓటర్ల జాబితాలు సిద్ధం చేస్తున్నట్టు జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఈఆర్వో) జి.మహేశ్వరరావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో గత అక్టోబర్ 27 వ తేదీ నుంచి ఈనెల 9 వ తేదీ వరకు వచ్చిన చేర్పులు, తొలగింపులు, మార్పులు వివరాల గురించి అన్ని పార్టీల ప్రతినిధులు అడగ్గా, వారికి సంబంధిత వివరాలను అందజేశారు. డబుల్ ఎంట్రీలు తొలగించాల్సిందిగా దాదాపు అన్ని పార్టీల వారు విజ్ఞప్తి చేయగా, ఓటరు జాబితాలో ఎటువంటి తప్పులు లేకుండా పారదర్శకంగా ఉండేలా సిద్ధం చేస్తున్నట్లు ఈఆర్వో తెలిపారు. వైఎస్సార్ సీపీ నుంచి తన్నీరు నాగేశ్వరరావు, ఆకుల శ్రీకాంత్, నాగరాజు, టీడీపీ నుంచి శ్రీరామమూర్తి, మైనేని రాధాకృష్ణ, కాంగ్రెస్ నుంచి దాచేపల్లి వీరభద్రరావు, బీఎస్పీ నుంచి కొదమల ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు. జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల తహసీల్దార్లు సూర్యారావు, వైకుంఠరావు, లక్ష్మీకల్యాణి, ఎలక్షన్ డీటీ కిషోర్‌బాబు, డీటీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వార్డుల్లో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం



ఆరవ వార్డులో రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్ మనోహర్

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణ అభివృద్ధిలో భాగంగా అన్ని వార్డుల్లో అవసరమైన చోట్ల రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చేపడతామని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ఒకటో నంబరు సచివాలయం పరిధిలోని ఆరవ వార్డులో న్యాయవాది లక్ష్మీనారాయణ ఇంటి వద్ద నుంచి కాకానినగర్ మెయిన్ రోడ్డు వరకు సుమారు రూ.3.25 లక్షల నిధులు మంజూరు కాగా, వాటితో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, ఐదవ వార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్‌తో కలసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆరవ వార్డుల్లో పర్యటించిన ఎమ్మెల్యే ఉదయభానుకు స్థానికులు ఈ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారని, దీంతో రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉదయభాను, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రకు కృతజ్ఞతలు తెలిపారు. అన్ని వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధులతో పనులు చేస్తున్నామని తెలిపారు.

22న బీసీ రథయాత్రకు తరలిరండి



రథయాత్ర వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘ నేతలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బీసీలకు శాసనసభలో 90 శాతం, పార్లమెంట్‌లో 13 శాతం స్థానాలను అన్ని రాజకీయ పార్టీలు కల్పించాలనే డిమాండ్‌తో ఈ నెల 22వ తేదీన నిర్వహించే బీసీ రథయాత్రకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏపీ ఇన్‌చార్జి వై.నూకాలమ్మ పిలుపునిచ్చారు. చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి కల్యాణ మండపంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రథయాత్ర వాల్‌పోస్టర్లు, కరపత్రాలను పలువురు బీసీ సంక్షేమ సంఘం నేతలు ఆవిష్కరించారు. అనంతరం బీసీ నాయకుడు శీరం నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూకాలమ్మ మాట్లాడుతూ.. బీసీల రాజాధికారం కోసం మరో స్వాతంత్ర్య పోరాట రథయాత్ర పేరిట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. బీసీలకు అన్ని రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని కోరుతున్నామని, అలా కేటాయించిన వారికే మద్దతు తెలుపుతామన్నారు. జాతీయ పార్టీలు 275 పార్లమెంట్ స్థానాలను, మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టి, చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో విజయవాడ సిటీ అధ్యక్షుడు, రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు కనిశెట్టి లక్ష్మణరావు, సంఘం విజయవాడ ఉపాధ్యక్షుడు తమ్మిన దుర్గారావు, బీసీ లీగల్ సెల్ కన్వీనర్, పిల్లా శ్రీనివాసరావు, సుకాశి సరిత, పీసా అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పక్షాల నాయకులతో ఆర్డీవో సమీక్ష



రాజకీయపక్షాల నాయకులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీవో సాయిబాబు


నందిగామ: నియోజకవర్గ పరిధిలో ఓటర్లకు ఈవీఎంల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నామని, ఈ కార్యక్రమానికి అన్ని రాజకీయ పక్షాల నాయకులు సహకరించి ప్రతి ఓటరుకు ఈవీఎంల వినియోగంపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగేలా చూడాలని ఆర్డీఓ పి.సాయిబాబు సూచించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం అన్ని రాజకీయపక్షాల నాయకులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో కొత్త ఓటర్ల నమోదుకు, ఓట్లు తొలగించుటకు వచ్చిన ఫామ్ 7 కు సంబంధించి, ఓట్ల సవరణ కోసం వచ్చిన ఫామ్ 8 కు సంబంధించి రాజకీయ పక్షాల నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ తప్పులు దొర్లని ఓట్ల జాబితా సిద్ధం చేసేందుకు అన్ని రాజకీయ పక్షాల నాయకులు సహకరించాలని కోరారు. ముఖ్యంగా నూతనంగా నమోదు చేస్తున్న ఓట్లకు సంబంధించి పూర్తిస్థాయిలో పరిశీలించాలని సూచించారు. తొలగింపులు, మార్పులు చేర్పులకు సంబంధించి కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామంలో ఓటర్లకు ఈవీఎంల వినియోగంపై అవగాహన కల్పించే కార్యక్రమం ప్రారంభమైందని తెలిపారు. సమావేశంలో అన్ని రాజకీయ పక్షాల నాయకులతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు స్విమ్మర్ల ఎంపిక



చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు బెంగళూరు వేదికగా జరిగే జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు కేఎల్ రావు స్విమ్మింగ్ పూల్ స్విమ్మర్లు ఎంపికైనట్లు కోచ్ రఫీ పేర్కొన్నారు. కేఎల్ రావు స్విమ్మింగ్ పూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోటీలకు ఎంపికైన విద్యార్థులను పలువురు సీనియర్ స్విమ్మర్లు అభినందించారు. ఈ నెల 16, 17వ తేదీల్లో నరసరావుపేటలో నిర్వహించిన 9వ సబ్ జూనియర్స్, జూనియర్స్ వింటర్ అక్వాటిక్ చాంపియన్స్ పోటీల్లో కేఎల్ రావు స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందుతున్న పలువురు విద్యార్థులు హాజరయ్యారు. వారిలో కెహెచ్. మేఘన 50, 100 మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో రజిత పతకం, 200 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో రజిత పతకాన్ని సాధించింది. ఓ.వెంకటఅశ్విత గగన 50 మీటర్ల ఫ్రీస్టైల్, బ్యాక్ స్ట్రోక్‌లో కాంస్య పతకాలు, కె.భవేష్ 1500 మీటర్ల ఫ్రీస్టైల్‌లో కాంస్య పతకాన్ని ఎస్.సుమతి హార్షిక వాటర్‌పోలో విభాగంలో పతకాలను సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను స్విమ్మింగ్ అసోసియేషన్ సభ్యులు ఐ.రమేష్, బి.బాలు అభినందించారు.

24న కేబీఎన్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గోపిశెట్టి మల్లయ్య తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేబీఎన్ కళాశాల ఓమ్నీ స్టూడెంట్స్ అసోసియేషన్(పూర్వ విద్యార్థుల సంఘం) ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు డీపీ రామకృష్ణ తెలిపారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం పోస్టర్‌ను ఆ కళాశాల ప్రాంగణంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ ప్రధానకార్యదర్శి, పూర్వ విద్యార్థి గోపిశెట్టి మల్లయ్య ఆవిష్కరించారు. అనంతరం డీపీ రామకృష్ణ మాట్లాడుతూ కేబీఎన్ కళాశాల స్థాపించి 58 సంవత్సరాలుగా విజయవంతంగా కొనసాగుతుందన్నారు. శాసనసభ్యులు, ఏపీఎస్‌లు, న్యాయవాదులు, శాస్త్రవేత్తలు, రాజకీయవేత్తలు, క్రీడాకారులు, కళాకారులు అనేక రంగాల్లో ఎందరో మేథావులను సమాజానికి అందించిన ఘనత కేబీఎన్ కళాశాలకు దక్కుతుందన్నారు. వివిధ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అన్ని గ్రూప్‌లకు సంబంధించి ఆయా సంవత్సరాల్లో బయటకు వచ్చిన పూర్వ విద్యార్థులందరూ తప్పనిసరిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి జల్లూరి శ్రీనివాసరావు, కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి సెమీ క్రిస్మస్ వేడుకలకు పటిష్ట బందోబస్తు



విజయవాడస్పోర్ట్స్: విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఈ నెల 20వ తేదీ బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సెమీ క్రిస్మస్ వేడుకలకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. స్టేడియంలో చురుగ్గా జరుగుతున్న కార్యక్రమ ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం ఆయన పర్యవేక్షించారు. ఈ వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో భద్రత ఏర్పాట్లను అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని అత్యంత పగడ్బందీగా చేస్తున్నామని స్పష్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. సీపీ వెంట అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు, డీసీపీ వి.అజిత, ఏసీపీ పి.భాస్కర రావు ఉన్నారు.

పాఠశాలల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు

కంచికచర్ల: మండలంలోని కీసర, పరిటాల ఎంపీపీ స్కూళ్లలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయని ఎంఈఓ బాలాజీ నాయక్ తెలిపారు. ముందుగా క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం పాస్టర్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేసి క్రీస్తు జన్మ వృత్తాంతం గురించి విద్యార్థులకు వివరించారు. తదుపరి క్రీస్తు పాటలకు విద్యార్థులు నృత్యప్రదర్శన చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాఫ్ట్ టెన్నిస్ జాతీయ పోటీలకు ఎంపిక



విజయవాడస్పోర్ట్స్: సాఫ్ట్ టెన్నిస్ జాతీయ పోటీలకు ఎస్‌డీఎం సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థినులు ఎం.భావన, పి.లావణ్య ఎంపికయ్యారు. గుంటూరులోని బీఆర్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి సింగిల్స్ పోటీల్లో భావన సిల్వర్, లావణ్య బ్రాంజ్ మెడల్‌ను సొంతం చేసుకున్నారు. అనంతరం నిర్వహించిన ఎంపిక పోటీల్లోనూ ఇరువురు క్రీడాకారిణులు అద్భుతమైన క్రీడా నైపుణ్యంతో రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్నారు. వచ్చే ఏడాది జనవరి 13 నుంచి 17వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కాలేజీలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ డాక్టర్ టి.వి జయలక్ష్మి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కల్పన, ఫిజికల్ డైరెక్టర్ వి.లక్ష్మీకనకదుర్గ క్రీడాకారిణులను అభినందించారు.

శ్రీరామభక్తుల పాదయాత్ర

తిరువూరు: ముక్కోటి ఏకాదశి సందర్భంగా భద్రాచలం సీతారామచంద్రస్వామి దర్శనార్థం గంపలగూడెం మండలం సత్యాలపాడు నుంచి భక్తులు చేపట్టిన పాదయాత్ర మంగళవారం తిరువూరు చేరింది. గత 25 సంవత్సరాలుగా తాము పాదయాత్ర చేసి ముక్కోటికి భద్రాచల సీతారాముల దర్శనం చేసుకుంటున్నామని నిర్వాహకులు హనుమంతరాజు తెలిపారు. 400 మందికి పైగా భక్తులు ఈ పాదయాత్రలో పాల్గొంటామని, ఈ నెల 22కు భద్రాచలం చేరనున్నట్లు తెలిపారు. తిరువూరు 15వ వార్డు కౌన్సిలర్ మోదుగు ప్రసాద్ ఈ భక్తబృందానికి వేంకటాచలస్వామి దేవస్థాన ఆవరణలో భోజన ఏర్పాట్లు చేశారు.

అథ్లెటిక్స్‌లో సెయింట్ ఆన్స్ విద్యార్థుల ప్రతిభ

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): విజయవాడ నగర అంతర పాఠశాలల అథ్లెటిక్స్ పోటీల్లో గుంటుపల్లి సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారని పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జేన్ ఆంటోనీ మంగళవారం తెలిపారు. విజయవాడ నలంద పాఠశాలలో జరిగిన పోటీల్లో 100 మీటర్ల రన్నింగ్, లాంగ్‌జంప్, 100+ నాలుగు మీటర్ల రిలే పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ జేన్ ఆంటోనీ, వ్యాయామ ఉపాధ్యాయుడు పుల్లారావు అభినందించారు.